




నెలనెలా ఒక జ్ఞాపకం

డాక్టర్ అవసరాల (వింజమూరి) అనసూయాదేవి

# రెండవ ప్రపంచ మహాయుద్ధం రోజులు

యూరప్‌లో రెండవ ప్రపంచ మహాయుద్ధం 1939వ సంవత్సరంలో సెప్టెంబర్ 3వ తేదీన ఆరంభమైంది. పోలాండు మీద హిట్లర్ దాడి చేయటం వల్ల, బ్రిటన్, ఫ్రాన్సులు ఆగ్రహించి, జర్మనీమీద యుద్ధం ప్రకటించాయి. 1940-41లో, ఇంగ్లాండులో ఎన్నో ప్రదేశాలు Blitz krieg (Lighthing strike) వల్ల భస్మమయాయి. 1940 సెప్టెంబరు మాసంలో 5,300 టన్నుల "ఎక్స్‌పోజివ్స్', 24 గంటలలో ఒక్క లండన్ మీదే ప్రయోగించారు.

తర్వాత, major coastal ports and centers of production and supply ని attack చేశారు. ఇండియాలో కొన్ని ముఖ్యపట్టణాల మీద కూడా బాంబులు వేశారు. మా ఊరు కాకినాడ చిన్న ఊరైనా, పోర్టు అవటం వల్ల బాంబులు ప్రయోగించారు.

సరిగ్గా 63 ఏళ్ళ క్రితం జరిగిన విషయమిది. అది 1942వ సంవత్సరం. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజులు. మా కుటుంబం కాకినాడలో ఉన్నాం. నేను పిఠాపురం రాజావారి కళాశాలలో బి.ఏ చదువుతున్నాను. అన్నయ్య బి.ఏ అయిపోయింది. సీత ఎసెల్సీలో ఉంది. మాకు వేసంగి సెలవలు. రామారావు పేటలో దివానుగారి బంగళాలో కాపురం ఉంటున్నాం.

యుద్ధం! యుద్ధం! యుద్ధం! ఏనోట విన్నా యుద్ధం కబుర్లే. తెల్లారేటప్పటికి న్యూస్‌పేపర్‌లో యుద్ధం విశేషాలే. కాఫీ హోటళ్ళలోను, కాలేజీ దగ్గర, సిటీఎంపోరియమ్ దగ్గర, సినిమాథియేటర్ల దగ్గర, టౌన్‌హాలులోను, మెక్లారిన్ హైస్కూల్ ఆవరణలోను, దేవాలయం దగ్గర, బ్రహ్మసమాజం దగ్గర, మెయిన్‌రోడ్డు మసీదు దగ్గర, ఉప్పుటేరు ఒడ్డున, జగన్నాధపురం వంతెన దగ్గర, ప్రజలు గుమికూడి, యుద్ధవిశేషాలే మాట్లాడుకునేవారు. రైల్వేస్టేషన్‌లోనూ, బస్‌స్టాండ్ దగ్గరా కూడా ఇదే తంతు. ఆఖరికి, కుళాయి దగ్గర

నీళ్ళుపట్టుకునే ఆడవాళ్ళూ, చాకిరేవులోని పాటక జనం కూడా, యుద్ధాన్ని గురించి వాళ్ళు విన్న విశేషాలు చెప్పుకునేవారు.

మా అన్నయ్యకొక చిత్రమైన గ్రూప్ స్నేహితులుండేవారు. పుట్టిమునిగినట్టు, ప్రొద్దున్నే 7గంటలకి మా ఇంటికి హాజరయేవారు. వాళ్ళకి న్యూస్‌పేపర్ కొనుక్కోవలసిన అవసరం లేదు. మాఅన్నయ్య, AtoZ పేపరు చదివి, వాళ్ళకి చెప్పాలి. వచ్చిన వాళ్ళకు మాఅమ్మ కాఫీ ఇచ్చి తీరుతుంది గదా! తాగేసి, మెయిన్‌రోడ్ మీద మేధావుల్లాగ నడుచుకుంటూ పోతూ, త్రోవలో కనపడ్డవారికి, యుద్ధాన్ని గురించి అన్నయ్య చెప్పిన పేపరు న్యూస్‌కి చిలవలూ, పలవలూ పెట్టి, అతిశయోక్తులు చెప్పేవారు.

మా ఇల్లు చర్చలకీ, డిబేట్స్‌కీ నిలయం. ఇంట్లో అందరూ తెలివైన వాళ్ళవటం కొంప మునిగింది. ఏ ఒక్కరూ మరొకరితో ఏకీభవించరు, వారి వారి ఇండివిడ్యుయాలిటీ కనపర్చుకోవటానికి. దానికి తోడు బంధువులూ, స్నేహితులూ కూడా అటువంటి వాళ్ళే. గాడేపల్లి అనంతం అన్నయ్య, వింజమూరి శివరామారావు, కామేశ్వరరావు, లక్ష్మీశం, పెద్దబ్బాయి, చిన్నబ్బాయి - అన్నయ్యలూ, అరవిందఘోష్‌గారి శిష్యులు. (అచ్చు గడ్డంతో ఘోష్‌గారు లాగే ఉండేవారు), గొప్ప మేధావులు, తిరపతి గారు, ముద్దుకృష్ణగారు, శివశంకరశాస్త్రిగారు, మా ఇంట్లో రోజూ గుమిగూడేవారు. గంటలు గంటలు యుద్ధాన్ని గురించి చర్చించేవారు, వాదించుకునేవారు, దెబ్బలాడుకునేవారు కూడా. అలాగ దెబ్బలాడి బయటికి వెళ్ళిపోయే వాళ్ళలో తిరపతిగారొకరూ, అనంతం అన్నయ్య మరొకడు. అసలు యుద్ధం ఏళ్ళ కొద్దీ సాగుతుంటే, ఈ యుద్ధాన్ని గురించిన వాదనల మినీ యుద్ధాలు మా ఇంట్లో రోజూ సాగేవి.

కాకినాడ ఊళ్ళో చాలా చోట్ల తవ్వి 'ట్రెంచెస్' కట్టారు. మిలిటరీ సోల్జర్స్, లౌడ్‌స్పీకర్సులో సందేశాలిస్తూ, రోజూ జీపుల్లో ఊరంతా తిరిగేవారు. సైరన్ వినగానే, షెల్టర్సులో ఎలాగ దాక్కోవాలో ప్రాక్టీసు చేయించేవారు. సైరన్ వినగానే, రోడ్డుమీద ఉన్నవాళ్ళు షెల్టర్సులోకి వెళ్ళాలి. రోడ్‌మీద ఒక్క పురుగైనా ఉండకూడదు, ఇళ్ళలో ఉన్నవాళ్ళు, తలుపులు, కిటికీలు మూసుకుని, లైట్లు ఆర్పేసుకోవాలి. ఈ సైరన్ ప్రాక్టీస్‌కి ఫలానా టైమని లేదు. రాత్రి, పగలు కూడా ఏదో ఓ టైములో సైరన్ వచ్చేది. ఒకప్పుడు, అది ప్రాక్టీస్ కోసమో, లేక నిజమైన సైరనో తెలిసేది కాదు. అయినప్పటికీ ఎదేదో సరదాగా గేమ్ ఆడుతున్నట్టుండేది.

యుద్ధం, బాంబింగులూ - ఇవన్నీ, హిస్టరీలోనూ, కథల్లోనూ వినటమే కాని, మనదేశానికి ఇలాగ నిజమైన యుద్ధం వస్తుందని ఎవరూ ఊహించలేదు. "ఇగ్నరెన్స్ ఈజ్‌బ్లిస్" అనేమాట వాస్తవమే ఐతే, ప్రస్తుత పరిస్థితుల్లో కాకినాడ ప్రజలెవరూ కంగారు పడలేదు సరికదా, ఒకవిధమైన భయంతో కూడుకున్న సరదాకూడా అనుభవించారనక తప్పదు. పుట్టాక, మనకళ్ళ ముందు మనం కూడా యుద్ధం చూడబోతున్నామనే ఎక్సైట్‌మెంట్‌కి లోనయారు.

1942వ సంవత్సరం, మే నెల 5వతేదీ అని చూచాయగా జ్ఞాపకం. ఆరోజు నాన్నగారు గండికోట భాస్కరరావునీ, వింజమూరి చిన్నబ్బాయినీ భోజనానికి పిలిచారు. భాస్కరరావు పేరెక్కిన డ్రామా ఏక్టర్. ఆంధ్రసేవా సంఘంవారి నాటకాలలో ప్రధాన స్త్రీ పాత్ర ధరించేవాడు. అందమైన ఆడవాళ్ళ కంటే అందంగా

ఉండేవాడుకూడా. వింజమూరి చిన్నబ్బాయి మాబంధువు - చాలానెమ్మదైనవాడు, మర్యాదస్తుడు, నాన్నగారికిష్టుడు. నాస్తికుడని అనేవారు. ఎప్పుడూ దేముడులేడు అంటూండేవాడు. వీళ్ళందరే కాకుండా, మామయ్య కృష్ణశాస్త్రి కుటుంబం అంతా మా ఇంట్లోనే ఉన్నారు.

మధ్యాహ్నం ఒంటిగంటప్రాంతం, నాగులాపల్లి రసాల మామిడి పళ్ళతో సహా మస్తైన భోజనం చేసి, తాంబూలం సేవించి, అందరూ మంచి రిలాక్స్ మూడ్‌లో ఉన్నారు. భాస్కరరావు మాత్రం. "అనసూయ హార్మోనియమ్ వాయిస్తే కొన్ని పద్యాలు పాడి వినిపిస్తాను" అన్నాడు. నేను హార్మోనియమ్ వాయిస్తున్నాను. భాస్కరరావు పాడుతున్నాడు. సడన్‌గా సైరన్ మోత వినబడింది. మిలిటరీవాళ్ళు, తలుపులూ, కిటికీలు మూసుకోమని, రోడ్మీదున్న వాళ్ళని ట్రెంచెస్‌లోకి వెళ్ళమనీ హెచ్చరిస్తూ, నిమిషాల్లో జీపుల్లో మాయమయారు. రోహిణీకార్తె ఎండలు మండుతున్నా ఏంచేయం? మాఇంట్లోకూడా తలుపులన్నీ మూశారు. పాపం హార్టు పేషెంట్ అయిన భాస్కరరావు గుండెలమీద చేయివేసుకుని, ముందుకు వంగి కళ్ళుమూసుకుని కూర్చున్నాడు. చిన్నబ్బాయి నాన్నగారి చేతులు పట్టుకుని "బుచ్చినాయన బాబయ్యా! దేముడున్నాడు! మనకేమీ హాని జరగదు" అంటూ ఏడవటం మొదలుపెట్టాడు. మామయ్య నోటమ్మట మాట పెగలటంలేదు. అందరికంటే పిరికివారైన నాన్నగారు "అందరూ? ఒకేచోట ఉండండి. పోతే కట్టకట్టుకుని అందరం ఒకేసారి పోతాం" అన్నారు. బుజ్జాయి పది ఏళ్ళవాడు, బుల్లి సీత అయిదేళ్ళది. వాళ్ళిద్దరూ, నాచెల్లెలు సీత, మంచాలకింద దూరారు. ముద్దుకృష్ణ మామయ్య తన వేదాంతం తను చెప్పాడు "ఏమంత కొంపమునిగింది? పోతేపోతాం. భయమెందుకు?" అన్నాడు. అత్తయ్య తోచక మరోసారి తాంబూలం వేసుకుంది. ఆగది కిటికీకి చిన్న కన్నం ఉంది. అందులోంచి ఏమైనా కనపడుతుందేమో అని చూడటానికి ప్రయత్నించాను నేను. అమ్మమ్మ "ఏమ్రా! బాంబులు పడతాయన్నారు ఇంకా ఎపుడూ? ఎన్నిగంటలకి పడతాయి?" అంటూ అమాయకంగా అడిగింది. బుల్లెమ్మాయక్కయ్య(పెద్దమ్మ) "రామారామా' అంటూ రామజపం చేస్తూ ఓమూల కూర్చుంది. అమ్మ, అన్నయ్య, నాన్నగారి ప్రక్క చేరారు. మామయ్య, రాజహంస అత్తయ్యకూడా అక్కడే సర్దుకుకూర్చున్నారు. మామ్మగారొక్కరూ మిస్సింగ్! అందరూ "అయ్యో! రాజమ్మామ్మగారేమైపోయారో!" అన్నారు. ఆ ఇంట్లో పాయిఖానాలు దొడ్లో ఎక్కడో దూరంగా ఉన్నాయి. మామ్మగారక్కడున్నారనుకుని తీసుకురావటానికి వెళ్ళారు మావాళ్ళు. మండుటెండలో, కాళ్ళు కాలుతుంటే, గొడుగువేసుకుని, బాంబులు ఎలాగపడతాయో చూడటంకోసం ఆకాశం అంతా గాలిస్తూ ఆత్రుతగా చూస్తున్నారు. సరిగ్గా అదేసమయంలో ఎక్కడో దూరంగా రెండుసార్లు బాంబులు పడ్డట్టనిపించింది. మామ్మగారు "అవిగో బాంబులు, దోసకాయల్లాగ రాలుతున్నాయి" అంటూంటే ఆవిణ్ణి బలవంతాన లోపలికి లాక్కొచ్చారు. నిజానికి, ప్లేనులు మాఇంటిమీదుగా, కుళాయి చెరువు మీదుగానే వెళ్ళాయి. ఎవరి నోటమ్మట మాటలేదు. చిన్నబ్బాయి మాత్రం చిన్నగొంతుతో "దేముడున్నాడు దేముడున్నాడు" అంటూ నమస్కారం పెడుతూ ఏడుస్తున్నాడు. ఇంతలో మళ్ళా ఆల్‌క్లియర్ సైరన్ మ్రోగింది.

కాకినాడ పోర్టుస్టేషన్ నుంచి సముద్రం నాలుగైదు మైళ్ళదూరంలో ఉంది. సముద్రపుటొడ్డు నున్న కిరసనాయిల్ టాంకులు మీద రెండు బాంబులు పడ్డాయి. ఊరికి డేమేజ్, జననష్టం లేకుండా రక్షింపబడ్డామన్నారు. కాని, మళ్ళా ఊరుమీద బాంబులు వేస్తారనే వదంతికి మా నాన్నగారు భయపడి,

మాబంధువులతో సంప్రదించి, ఆరు కుటుంబాల వాళ్ళం తాత్కాలికంగా పిఠాపురం మకాం మార్చటానికి నిశ్చయించారు.

మర్నాడు, ఎందుకైనా మంచిదని రాత్రికి రాత్రే ఆరు రెండెడ్లబళ్ళలో, కుటుంబాలతో పిఠాపురం బయలుదేరాం. మా ముసలివాళ్ళూ, ఊరగాయలూ, వంటసామాన్లూ ఒకబండిలో, మామయ్యగారి కుటుంబం (ముద్దుకృష్ణగారితో) సహా ఒకబండి, వింజమూరి శివరాం అన్నయ్య కుటుంబం మరోబండి, పెద్దబ్బాయి, చిన్నబ్బాయి కుటుంబాలకు రెండు బళ్ళు, మాకుటుంబానికి ఇంకో బండిలోనూ పెళ్ళివారులాగ బయలుదేరాం. మధ్యలో అవసిష్టాలకి చెట్లకింద ఆపుకుంటూ, తెల్లవారుఝామున పండూరుచెరువు వద్ద పళ్ళుతోముకుని, మామ్మగారు చేసిన మినపరొట్టె (తేనెపాకంతో), శేమియాఉప్మా, విస్తళ్ళలోనూ, దొన్నెలలోనూ తిని, ఫ్లాస్కులోని కాఫీ త్రాగాం. కొన్ని కుటుంబాలు పులిహోర, దధ్యోజనం తెచ్చుకున్నారు. ఎనిమిది గంటల ప్రాంతానికి పిఠాపురం చేరాం.

వింజమూరి కామేశ్వరరావన్నయ్య ఇల్లు పూర్వకాలపు లోగిలి. నాలుగిళ్ళచావిడి. చాలా గదులున్నాయి. మామయ్య కృష్ణశాస్త్రిది గొప్ప జాతకం. ఎక్కడున్నా రాజభోగం అనుభవిస్తాడు. ఉన్నవాటిలో మంచి గది మామయ్యకిచ్చారు. రెండవది సౌకర్యాలకు అలవాటు పడ్డమాకు కేటాయించారు. మిగిలిన గదులు ఒక్కొక్క కుటుంబానికిచ్చారు. ముద్దుకృష్ణమామయ్య వాళ్ళ స్నేహితులింటికి వెళ్ళాడు.

ఆ యింటికి పూర్వకాలపు మరుగుదొడ్లు రెండున్నాయి. సగమ్మంది మగవాళ్ళూ, పిల్లలూ చెరుకుల కాలువగట్టుకి వెళ్ళేవారు కనక, పెద్ద క్యూఉండేదికాదు. బాతురూంలసలేలేవు. అందరూ పెరట్లో నూతిదగ్గర స్నానాలు చేయవలసిందే నయం! ఎండాకాలం అవటంవల్ల చలిలేదు. రెండురోజులు నేను బట్టలతోటే స్నానం చేసి తంటాలు పడ్డాను. మూడోరోజు, రెండురాటలు పాతి, దణ్ణం కట్టారు. దానిమీద బెడ్‌షీట్ లేసి దానివెనకాల స్నానం చేయటానికి ఏర్పాటు చేశారు. స్నానం మధ్యలో, గాలికి దుప్పటి కిందపడి రసాభాసైంది. ఆ మర్నాడు, చిన్నమరుగు కట్టించారు నాన్నగారు. అక్కడ స్నానం చేయటానికి ఏర్పాటు చేశారు. అక్కడ స్నానం చేస్తున్నప్పుడు, కుమ్మరిపురుగులు, వానపాములు, జెర్రులూ కనపడి, టవల్‌తో బయటకు పరుగెత్తుకు వచ్చాను. తర్వాత నా మేనత్తను కాపలా పెట్టుకుని, ప్రాణాలు బిగబట్టి, స్నానం చేసి బయటపడేదాన్ని.

మామయ్య ఎక్కడున్నా ఓ వెలుగు వెలుగుతాడు. మామయ్యకి ఎనిమిదిమంది అక్కచెల్లెళ్ళు. ఆరుగురు పెద్దతాతయ్యగారి కూతుళ్ళు, ఇద్దరూ మా అమ్మా పెద్దమ్మలు. ఇంతమందికీ గారాబపు తమ్ముడు మామయ్య. వీళ్ళు కాక కజిన్ సిస్టర్సు, మేనగోడళ్ళూ ఉన్నారు. తెల్లారితే "ఒరేయ్ తమ్ముడూ! ఏం వండమన్నావు?" అంటూ చుట్టూ చేరేవారు. ఎవరి వంటలు వాళ్ళు వండుకుంటున్నా, అందరూ "ఇదితినరా, అదితినరా!" అంటూ అన్నీ వడ్డించేవారు. రకరకాల వంటలతో మామయ్యకి రోజూ విందే పురమాయించుకుని వండించుకునేవాడు. కొన్నాళ్ళు మరొక పద్ధతి ప్రయత్నించారు. ఒక్కొక్క కుటుంబం, ఒకపదార్థం అందరికీ సరిపోయేలాగ వండాలి. అలాగ రెండు రకాల కూరలు, రెండు పచ్చళ్ళు, పప్పు, పులుసూ, ఆరు కుటుంబాల వాళ్ళకీ కేటాయించి, పెరుగు, ఊరగాయలు, అప్పడాలు, వడియాలు లాంటివి కామేశ్వరరావన్నయ్య కుటుంబానికిచ్చారు.

ఇలాగ రోజూ సరదాగా 'పిక్‌నిక్'లాగుండేది. తరచు, పుట్టినరోజులో, పురుళ్ళో, మైలలో, తద్దినాలో. ఏదో ఒకటి వస్తూండేవి. అలాంటప్పుడు మా ముసలమ్మలు పిల్లలందరిచేత పనులుచేయించేవారు. నేనొక్కదాన్నే

ఏపనీ చేయనని పేరు. నేనేం చేయను? నన్ను గారాబంగా పెంచారు. ఇది కొందరి ముసలాళ్ళకి తిక్కగా ఉండేది. ఎలాగైనా నాచేత ఏదో ఒక పని చేయించాలని ఉండేది. ఒక ముసలి బంధువు నాచేత కాళ్ళు పట్టించుకుందామని బహు ప్రయత్నం చేసి విఫలురాలైంది. మరొక బంధువు "అలాగ కూర్చుంటారేమిట్రా? ఎలాగైనా వడ్డించండి" అని నాతో మిగిలిన అమ్మాయిలను కూడా కలిపేవారు. బాగుండదని వళ్ళుమండి, రాజామణి, జూ (రాజేశ్వరినలాగ పిలిచేవాళ్ళం), నేనూ, మజ్జిగ వడ్డిస్తున్నట్టే వడ్డిస్తూ, పక్కకెళ్ళి ముగ్గురం మస్తుగా మజ్జిగతాగి, మిగిలినదానిలో నీళ్ళు కలిపి వడ్డించేవాళ్ళం.

పిల్లలందరికీ నేను లీడర్ని. నామాట వేదవాక్కు. నాచుట్టూగుమికూడేవారు. నాకబుర్లూ, జోక్సూ, పాటలూ అందరికీ ఇష్టం. వీళ్ళకి పాటలూ, డాన్సులూ నేర్పేదాన్ని, కాళ్ళకీ, చేతిగోళ్ళకీ క్యూటెక్సు వేసేదాన్ని, మేకప్ చేసి నాటకాలాడించేదాన్ని. ఇదికూడా మా పెద్దవాళ్ళలో కొందరికిష్టంలేదు. ఓరోజు, వీధినాటకంలో డాన్సుపాట 'భద్రాదివాసుండ' నేర్పిస్తూ అందరం తెగ గెంతుతున్నాం. అపోజిషన్ పార్టీ ముసలమ్మలకి కోపంవచ్చి "ఇలాంటి లొల్లాయి పాటలు పాడకపోతే, భక్తిగా దేవుడిమీద పాటలు పాడకూడదే" అంది ముఖం అదోలా పెట్టి. సరే రండని మా పిన్నతల్లులతో సహా అందర్నీ పిలిచి కూర్చోపెట్టి, "చాలా మంచి తత్వం పాడతాను వినండి. ఇందులో ఎంతో వేదాంతం ఉంది" అన్నాను.. నేను హార్మోనియమ్ వాయించుకుంటూ, "తుమ్ మేరి, తుమ్ మేరేసాజన" అంటూ ప్రేమగీతం పాడి (అదృష్టం వాళ్ళెవరికీ హిందీరాదు), దానికి "మట్టిలో పుట్టి మట్టిలో పెరిగి ఈమాయాదేహానికి కాపీనాంతములు చాలవా ఎందుకర్రా మీకీ తెల్లపంచలు?" అని అబద్ధపు అర్థాలు చెప్పి వాళ్ళను మెప్పించేదాన్ని. ఓదేముడు పటం పెట్టి, అన్నీ ఇలాంటి పాటలే పాడేదాన్ని.

మామయ్య సెషన్సు వీధి అరుగుమీద. ప్రొద్దున్నే అరుగులు కడిగించి, చాపలు పరచేవారు. మామయ్యకి మాత్రం ఓదిండూ బాలీసూ, గోడకానుకునేలాగ ఏర్పాటు చేసేవారు. తొమ్మిది గంటలకి మామయ్య సభ తీర్చేవాడు. అప్పటి మామయ్య ఎలాగుండేవాడంటే, తెల్లటిపంచ, ముదురురంగు చొక్కా, ఒళ్ళంతా చందనం, కళ్ళకి సురా, మెళ్ళో పూసలదండలు, చేతికి మల్లెదండా, గిరజాలజుట్టుతో హిప్పీలాగుండేవాడు. అయినా ఆపెర్సనాలిటీ అందర్నీ ఆకర్షించేది. తరచు కురుమిళ్ళ వెంకట్రావు, తనికెళ్ళ సత్యనారాయణ, గోపాలదాసు, ముద్దుక్రిష్ణ, వాడ్రేవు గోపాలకృష్ణ, మొక్కపాటి నరసింహశాస్త్రి, నారాయణదాసు మొదలగువాళ్ళు వచ్చేవారు. కొందరు యువకులు కూడా వచ్చేవారు.

అపుడపుడు మానాన్నగారి స్నేహితులు జాషువా కవిగారు, నాన్నగారి క్లాస్‌మేట్ అయిన పిఠాపురం మహారాజావారి బావమరది సోములు బాబుగారి కొడుకులు రంగబాబు, నారాయణబాబులు వస్తుండేవారు. రోజూ మంచి మంచి చర్చలు, స్వీయకవితలు ఎట్సెట్రా ఉంటుండేది. ఇంట్లో ఆడవాళ్ళతో కలవక, అమ్మమ్మొక్కత్తె, వీధిగుమ్మంలో కూర్చుని, అర్థంకాకపోయినా, ఈచర్చలు వినేది.

ఈ విధంగా వేసంగి సెలవలయేవరకూ పిఠాపురంలోనే ఉన్నాం. మామయ్య వీధరుగుమీద, నేను నా అమ్మాయిలగ్రూప్‌తో మా గదిలోనూ, అమ్మా మొదలగు వారంతా వంటింట్లోను, ముసలమ్మలంతా పెరట్లోనూ ఉండేవాళ్ళం. మాకు కాలక్షేపాలు రెండే కట్టకట్టుకుని అందరం అటు మాధవస్వామి గుడికో, ఇటు కుక్కుటేశ్వరస్వామి గుడికో వెళ్ళేవాళ్ళం. రెండోది, ఆ ఊళ్ళో ఉన్న ఒక్క సినీమాహాలులోనూ ఏపిక్చరు వేసినా, ఆరు కుటుంబాలవాళ్ళం వెళ్ళేవాళ్ళం.

పూర్వపు పొన్నాడమందబయలులని బస్సు పడ్డాక, బస్స్టాండుచేశారు. దానికెదురుగా ఓకాఫీహోటల్, దానిప్రక్క గురువుగారిల్లు. రెండిల్లు దాటాక సినీమాహాలు. నిజానికి అది డ్రామాథియేటరు. డ్రామాలకి, ముందు కుర్చీలకి టిక్కెట్టెక్కువ, నేలక్లాసు తక్కువ. ఆ థియేటర్ వాళ్ళకి కుర్చీలు మార్చటం బద్ధకమో, లేక తెలివి తక్కువతనమో అలాగే వదిలేశారు. సినీమాకి కుర్చీ టిక్కెట్టు కొనుక్కుంటే, తెరకి దగ్గరగా ఏమీ సరిగా కనపడదు. మా ఆరు కుటుంబాల వాళ్ళం, దాదాపు అరవైఅయిదు మంది, నేలటిక్కెట్టు (ఒక్క అణా మాత్రమే) కొనుక్కుని, ఇంటినుంచి చాపలు పట్టు కెళ్ళి పరచుకుని చూసొచ్చేవాళ్ళం. సినీమాహాలు దగ్గరవటం వల్ల నడిచివెళ్ళొచ్చేవాళ్ళం.

అపుడపుడు ఆథియేటర్లో మంచి నాటకాలాడేవారు. దానికి మాత్రం, డ్రామాలు ఇష్టమున్నవాళ్ళం కొద్దిమంది ముందు కుర్చీ టిక్కెట్లు కొనుక్కుని చూసేవాళ్ళం. మామేనత్తకి డ్రామాల పిచ్చి. ఆవిడ తప్పనిసరిగా వచ్చేది. పారుపల్లి సుబ్బారావుగారు రాధవేషంలో, లావుగా, గుండు లాగుండేవారు. జొన్నవిత్తుల శేషగిరిరావుగారు కృష్ణుడు వేషంలో బక్కగా ఉండేవారు. ఆయన రాధనుద్దేశించి, "రాధా ఎంత కృశించితివో" అని పాడేవారు. కథ మంచి రసగంధాయపట్టులో నడుస్తున్న సందర్భంలో, ఆపి, పాటను వన్సుమోర్ కొట్టి పాడించేవారు. అయినా చిత్రం! అందరూ ఆనందించేవారు.

మేమున్న ఇంటికి ఎదురుగా ఓ వేశ్యాగృహం ఉంది. అందులో ఉన్న ముగ్గురాడవాళ్ళకీ నేను పేర్లుపెట్టాను. చిన్ని చిన్ని తప్పటడుగుల కూర్మావతారం, సిలెండరమ్మ, డేగలకన్నమ్మ. ఈ డేగలకన్నమ్మ సడన్గా చనిపోయింది. శవాన్ని ఎత్తటానికి ఎవరూరాలేదు. మామయ్య, "ఒరేయ్ శివరామం మనం మోసేద్దాం రండి పాపం" అన్నాడు. అంతపనీ చేసుండును. ఈలోగా వాళ్ళ మనుష్యులొచ్చారు.

ఓరోజు, సోములుబాబుగారబ్బాయి నారాయణబాబుగారు, పన్నెండేళ్ళ అబ్బాయిని తీసుకొచ్చి నాదగ్గర పాడించి, నన్నొక పాట నేర్పించమన్నారు. నేను ట్యూన్ పెట్టిన "జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి" నేర్పించాను. ఆ అబ్బాయి పిఠాపురం నాగేశ్వరరావు. తర్వాత ఈపాటే పాడి ప్లేబాక్ పాడే అవకాశం సంపాయించుకున్నానని చెప్పాడు. నన్ను "గురువుగారు" అని పిలిచేవాడు. అతను మద్రాసు వచ్చాక నాతో కొన్ని కచేరిలలో పాడించానుకూడా.

యుద్ధపు రోజులు మకాం కొద్దిరోజులలోనూ, మేమున్న ఇంట్లో, పురుళ్ళు, నామకరణం, బారసాలలు, పుట్టినరోజులు, షష్టిపూర్తి, సంర్తబంతులు, ఒకటేమిటి తద్దినాలతో సహా అన్ని రకాలు జరిగాయి.

యుద్ధం సద్దుమణిగింది. కాకినాడ సేఫ్జోన్గా డిక్లేర్ చేశారు. మాకుటుంబాలు మూటాముల్లీ కట్టి, ఎలాగ వచ్చామో అలాగే మళ్ళా, ఆ బళ్ళలో వెనక్కి వెళ్ళాం.

రెండవ ప్రపంచయుద్ధంలో పదహారు మిలియనుల అమెరికన్స్ armed forcesతో పనిచేశారు. మూడొందలవేల మంది ప్రాణాల్ని కోల్పోయారు. 1945, మే 7వతేదీన జర్మనీ లొంగిపోయింది. మే 8వతేదీని V.E Day అనగా Victory in Europe Dayఅన్నారు. 1945, ఆగస్టు 14వ తేదీన్ని జపాను లొంగిపోయింది. ప్రెసిడెంటు ట్రూమెన్ సెప్టెంబర్ 2వతేదీ V.J Day జరుపుకున్నారు.

ప్రపంచాన్నే సర్వనాశనం చేసి, ధ్వంసంచేసి, లక్షలాది ప్రజల్ని బలిగొన్న ఇంత భయంకరమైన యుద్ధం, ప్రపంచ చరిత్రలో World War 2 (రెండవ ప్రపంచ మహా యుద్ధం) అని నిర్ణయించారు.

మాఅమ్మమ్మ, మొదటి ప్రపంచయుద్ధాన్ని గురించి, విక్టోరియా మహారాణిని గురించి విశేషాలు చెపుతూంటే, నోరెక్కపెట్టి ఆశ్చర్యంగా వినేవాళ్ళం. ఇపుడు, రెండవ ప్రపంచ మహా యుద్ధాన్ని గురించి అలాగే నేనూ నామనవలకీ, మీకూ చెప్పగలుగుతున్నాను.

**V for Victory, V for Vinjamuris also.**



